



# పట్టెమంచం

మల్లాది వెంకట కృష్ణమూర్తి

"మా అమ్మాయికి పెళ్ళి కుదిరిందోయ్!" ఇంటాయన మాటలు వెంటనే రవీంద్రకి అర్థం కాలేదు. ఎదురుచూడని విషయం హటాత్తుగా చెబితే వెంటనే అర్థం చేసుకోలేని వాళ్ళలో రవీంద్ర ఒకడు.

ఆయన ఇచ్చిన నాలుగు మూలలా పసుపు రాసిన కవరు చూశాక కొద్దిగా అర్థం అయింది. కవరు తెరిచి అందులోంచి సెంట్ వాసన వేస్తున్న శుభలేఖ చూశాక పూర్తిగా అర్థం అయింది.

"సంతోషమండి" అన్నాడు మనసులో ఏదో బాధ అనిపించినా.

"అల్లుడుకి ఆరు అటో లున్నాయి. వాటిని అద్దెకిచ్చి తను హాయిగా కాలుమీద కాలు వేసుకుని కూర్చుంటాడు."

శుభలేఖ మీద తారీఖు చూసి "అల్లుడవడానికి ఇంకా ఎనిమిది రోజు లాగండి" అని మనసులో అనుకున్నాడు.

"సంతోషం" అన్నాడు.

"ఒక మూడు రోజుల ముందు నీ గది ఇవ్వాలోయ్." చెప్పాడు ఇంటాయన.

వెంటనే అర్థం కాలేదు రవీంద్రకి.

"చుట్టాలంతా వస్తారు. ఇల్లు సరిపోదు. ఒక మూడు రోజుల ముందు నీ గది ఇవ్వు. పెళ్ళయ్యాక ఒక రెండు రోజు లాగి తిరిగి ఇచ్చేస్తాం."

"అంటే పదిహేనో తారీఖు ఇచ్చి తిరిగి ఇరవైయో తారీఖు రావచ్చా?" శుభలేఖలోని తారీఖు చూసి అడిగాడు రవీంద్ర.

"అవును. ఈ సహాయం చెయ్యాలి నువ్వు."

"అలాగే నండి. మీ ఇల్లేగా! అయినా..."

"మా ఇల్లయితే మాత్రం? అద్దెకున్నంత కాలం నీ గది కిందే లెక్క."

ఇంటాయన వెళ్ళిపోయాక రవీంద్రకి ఆయన కూతురు కమల గుర్తుకు వచ్చింది.

అంటే, తను పొరబడ్డా డన్న మాట. కమలకి తనంటే ప్రేమ అనే భ్రమలో ఉన్నాడు ఇంతకాలం.

ఎందు కలా దొంగచూపులు చూసేది తను కనబడ్డప్పుడల్లా? వయసులో ఉన్న ఆడపిల్లలంతా అంతేనా? కేవలం ఆసక్తేనా? ప్రేమయి ఉండదా?

ప్రతి బుధవారం సాయంత్రం గది గుమ్మం దగ్గర నిలబడి వార పత్రిక అడిగి తీసుకుంటుంది. వారంలో నాలుగుసార్లయినా తన తమ్ముడిచేత ఏదో ఒక టిఫిన్ పంపిస్తూ ఉంటుంది. చలికాలంలో వేన్నీళ్ళు ఇస్తుంది. తన బట్టలు వాళ్ళ చాకలికి వేసి, ఇస్త్రీ బట్టలని ఎంతో శ్రద్ధగా పంపిస్తూంటుంది.

వారపత్రిక అడగటం తప్ప తా మిద్దరి మధ్యా మరే మాటలు లేవు. అయినా కమల ప్రతి చర్యలో తనంటే ఎంతో ఇష్టం అనే అర్థం స్ఫురించింది తనకి. అది కేవలం తన వూహేనా?

చామనచాయలో, కొద్దిగా లావుగా, ఇంట్లో పరికిణి వోణిలతో, బయట చీరల్లో తిరిగే కమల వయసు పద్దెనిమిదే. పద్దెనిమిదో ఏడు అమ్మాయి అంటే ఇరవై ఏళ్ళ ప్రతి అబ్బాయికీ ఇష్టం ఉంటుంది.

చాలాసేపు ఎంతో వెలితిగా ఫీల్ అయ్యాడు

రవీంద్ర. ఆ అమ్మాయి శాశ్వతంగా ఇంకొకరి సొత్తయి పోతుందనే ఆలోచనే ఇబ్బందిగా ఉంది. తన సొత్తు కాకపోయినా కమల ఒంటరిగా బ్రహ్మచారిణిలా ఉంటే ఎంతో బాగుండు ననిపించింది రవీంద్రకి.

పధ్నాలుగో తారీఖు రాత్రి గదిలోని మూడు ట్రంకు పెట్టెల్లో తన క్లాస్ పుస్తకాలు, ఏక్స్ట్రా లాంటి సామాను సర్దేసి వాటికి తాళాలు వేశాడు. తన మంచం కిందకి తోసేశాడు వాటిని.

ఆ అయిదు రోజులూ పక్క సందులోని తన క్లాస్‌మేట్ గదిలో ఉండటానికి నిర్ణయించుకున్నాడు.

"ఈ అయిదు రోజులూ రెండు పూటలా భోజనానికి ఇక్కడికే రా, నాయనా."ఇంటావిడకి గది అప్పగించాక చెప్పింది.

"కంగ్రాచ్యులేషన్స్, కమలగారూ!" చెప్పాడు రవీంద్ర మర్నాడు వాళ్ళింటికి వెళ్ళినప్పుడు చెట్లకి బావిలోంచి నీళ్ళు తోడి పోస్తున్న కమలతో.

సిగ్గుగా నవ్వింది.

కమల కట్టిన పరికిణీ వంక చూశాడు.

సన్నటి నడుం ఒంపు స్పష్టంగా కనబడుతోంది.

ఒక్కసారి అక్కడ ముట్టుకుంటే ఎలా ఉంటుంది?

ముద్దు పెట్టుకుంటే?

"మీ ఆయన మీ అంత బాగుంటాడా?" అడిగాడు.

మళ్ళీ సిగ్గుగా నవ్వింది.

కమల పెళ్ళి రోజు కాలేజీకి వెళ్ళలేదు రవీంద్ర.

పెళ్ళికొడుకుని చూశాక అర్థమైంది రవీంద్రకి. తనకన్నా బాగున్నాడు.

ఒకవేళ తనని ప్రేమించినా, కమల ఇప్పుడు అతన్ని ఇంకా ఎక్కువగా ప్రేమించగలదు.

మనఃస్ఫూర్తిగా వేశాడు అక్షింతలు వాళ్ళమీద. పెళ్ళయ్యాక వడ్డనలో సహాయం చేశాడు. నూతన దంపతులకి పాయసం తనే స్వయంగా వడ్డించాడు.

రాత్రి తన స్నేహితుడి గదికి చేరుకున్నాక మళ్ళీ కమల గుర్తొచ్చింది. వెలితి, బాధ మళ్ళీ రవీంద్రలో ప్రవేశించాయి. పెళ్ళి వాతావరణంలో సరదాగా, సంతోషంగా ఉండ గలిగాడు కాని, గదిలో మాత్రం ఎంతో అసీజీగా ఉంది.

తన మిత్రుడితో కలిసి సెకండ్ షోకి సినిమాకి వెళ్ళాడు.

ఆ రాత్రి కమలకి శోభనం అన్న సంగతి రవీంద్రకి తెలుసు.

• • •

రవీంద్ర తనగదికి వచ్చేశాడు. రోజూ సాయంత్రం టిఫిన్ రావడం లేదు ఇదివరకులాగా.

కమల లేని లోపం కనబడుతోంది.

ఆ ఒక్క విషయంలోనే కాదు.

రేడియోలోంచి రాత్రి పాటలు పెద్దగా వినపడటం లేదు. ఇలాంటి చిన్న చిన్న తేడాలు చాలా కనబడి తరుచు కమలని గుర్తు తెస్తున్నాయి.

ఆ సంగతి అనుకోకుండా రవీంద్రకి తెలిసింది.

ఎదురు చూడని విషయాలు రవీంద్రకి చెప్తే ఆ సంగతి అతనికి వెంటనే అర్థంకాదు.

కమల తమ్ముడు ఒక రోజు సాయంత్రం మాటల్లో చెప్పాడు రవీంద్రకి:

"మా కమలక్కని, బావని ఈ గదిలోనే పెట్టి తలుపేసేశారు."

"ఏమిటి?" అడిగాడు రవీంద్ర అర్థంకాక.

మళ్ళీ ఆ మాటల్నే చెప్పాడు కమల తమ్ముడు.

"ఎందుకు?"

"అల్లరిచేస్తే..."


"అల్లరి చేశారా?"

"ఊహుఁ. పెళ్ళయిన రాత్రి వాళ్ళిద్దరినీ ఈ గదిలో పెట్టి బయట తలుపేసేశారు. ఎందుకని అడిగితే వాన్నారు 'అల్లరి చేస్తున్నా' రని అన్నారు. వాళ్ళేం అల్లరి చెయ్యలేదు."

అయిదేళ్ళ కమల తమ్ముడు చెప్పాడు రవీంద్రకి.

కొద్ది క్షణాల తర్వాత అర్థం అయింది రవీంద్రకి. మొదటి రాత్రి!

కమల, కమల మొగుడు...వాళ్ళ మొదటి రాత్రి ఇక్కడే...తన గదిలోనే జరిగింది.




తన గదిలో సీలింగ్ ఫాన్ ఉంది. గాలి, వెలుతురు ధారాళంగా వస్తాయి. వాళ్ళింట్లో వంటగది, వరండా, డ్రాయింగ్ హాల్ కుదరవు. ఉన్న ఒక్క బెడ్ రూం నిండా బంధువులు.

అందుకేనా గదినిండా నాముతో ముగ్గులు పెట్టారు?

మంచం.

తన మంచం తన పట్టె మంచం.

తన మంచాన్ని ఉపయోగించారు.

వెంటనే మంచం మీద నుంచి లేచి ఆర్గానిక్ కెమిస్ట్రీ పుస్తకం తెరిచాడు. ఏం చదివినా బుర్ర కెక్కలేదు.

లైటార్పి మంచం మీద పడుకున్నాడు.

మనసంతా గజిబిజిగా ఉంది.

సరిగ్గా వారం క్రితం ఇదే సమయంలో కమల, కమల మొగుడు ఇదే గదిలో, ఇదే మంచం మీద ...

ఇప్పుడు తను పీలుస్తున్నది అదే గాలా? ఆ ఆలోచనలో అడ్డం వేయాలి. వేయాలి. వేయాలి. ఎలా?

హంగరీ దేశంలో మాట్లాడే కళని పోషించడానికి ప్రతి సోమవారం టెలివిజన్ ప్రసారాలు ఉండవు.

రోమన్ చక్రవర్తి నీరో పాట పాడుతుంటే ఆడిటోరియంలోంచి ఎవరూ బయటికి వెళ్ళకూడదు. బయటికి వెళ్ళాల్సిన అవసరం వచ్చినవాళ్ళు మరణించినట్లుగా నటించేవాళ్ళు. వాళ్ళని పాతిపెట్టడానికి బయటకు తీసుకు ...

సరిగ్గా ఏడు రోజుల క్రితం ఇదే సమయంలో కమల, కమల మొగుడు నగ్నంగా, పూర్తి నగ్న ...

పాతిపెట్టడానికి బయటికి తీసుకు వెళ్తుంటే ..

నగ్నంగా ఇదే గదిలో, ఇదే మం ...

బయటకి తీసుకు వెళ్ళాక శ్మశానానికి వెళ్ళే దారిలో...

ఇదే మంచం మీద ఒకరి చేతుల్లో ఒకరు, ఒకరి కౌగిలిలో మరొకరు ... దారిలో శవాలని తీసుకువెళ్ళే గుర్రాలు లాగే బండిలోంచి దిగి ...

బలంగా కౌగలించుకుని ముద్దు పెట్టుకుంటూ, కిలకిలా నవ్వుతూ ...

... దిగి ఇంటికి వెళ్ళిపోయే వారు. రోమన్ చక్రవర్తి నీరో పాట పాడుతూంటే ...

పరికిణీ, సున్నగా మెరిసే చర్మం, కమల నగ్న సౌందర్యం ...

చక్రవర్తి, పాట, ఆడిటోరియం, నీరో, వర్తి, మరణం, చర్మం మీద అక్కడ ముట్టుకుంటే ఎంతో మెత్తగా, బహుశా సిల్కులా ...

రవీంద్ర స్ప్రింగ్‌లా లేచి కూర్చున్నాడు మంచం మీదనించి. ఒంటినిండా చెమట పోసింది. ఎంతో దూరం పరుగెత్తినట్టుగా ఆయాసంగా వూపిరి పీలుస్తున్నాడు.

లేచి లుంగీ విడిచి పేంట్, షర్ట్ తొడుక్కున్నాడు గబగబా. తొడుక్కుంటూంటే రవీంద్రకి వూహల్లో చాలా శబ్దాలు వినబడుతున్నాయి ఆ మంచం మీద నించి.

బూట్లు తొడుక్కోకుండా వాటిని చేత్తో పట్టుకుని బయటికి వచ్చి గదికి తాళం వేశాడు.

సందులోకి వచ్చాక వూపిరి సరిగ్గా పీల్చుకో గలిగాడు. అప్పుడు తొడుక్కున్నాడు బూట్లు. అప్పుడు పెట్టుకున్నాడు షర్ట్, పేంట్ గుండీలు. జేబులోంచి దువ్వెన తీసి అప్పుడు దువ్వుకున్నాడు జుట్టు.

పక్కసందులోని తన స్నేహితుడి గదికి చేరుకుని, అతని గది తలుపు తట్టాడు.

"ఏమైంది?" అడిగా డతను ఆశ్చర్యంగా, రవీంద్ర కళ్ళలో కనబడే చెప్పలేని భావాన్ని గుర్తించి.

మర్నాడు రవీంద్ర పక్కసందులోని తన స్నేహితుడి గదికి మారాడు. రవీంద్ర స్నేహితుడు రవీంద్ర గదికి మారాడు.

"నా కిదేం నచ్చలేదోయ్. ఎంతో బుద్ధిమంతుడివి. ఎందు కిలా అకస్మాత్తుగా...?"అడిగాడు ఇంటాయన రవీంద్రని.

రవీంద్ర జవాబుగా నవ్వాడు. అంతే.

తన పందిరి పట్టెమంచాన్ని మాత్రం అక్కడే వదిలేశాడు. ★